# సంయమనం

కొండయ్య బావంటే ఎవరో కాదండీ, స్వయానా నా అక్క మొగుడు. అండపిండ బ్రహ్మండాల్లో దేనిగురించయినా గడగడా మాట్లాడగలడు. మాటలతో కొండల్ని పిండికొట్టెయ్య గలడు. చేతల్లో మాత్రం చిక్కడు, దొరకడు.

అంతటి ఖిలాడీ విధిచేతిలో కీలుబొమ్మయి ముక్కుతూ మూల్గుతూ ఆస్పత్రి మంచమ్మీద నిస్త్రాణగా పడుకున్నాడంటే నమ్మకం కుదరలేదు. కానీ అరడజను మంది కుటుంబ సభ్యులు మంచం చుట్టూ ఏడుస్తూ నుంచుంటే నమ్మకేం జేస్తానూ ?

"చూశావురా, తమ్ముడూ... మీ బావ !" అక్క నా గుండెలమీద వాలి బోర్మన్నది. గ్లూకోజ్ ఎక్కుతోంది. పులిలాంటి బావ పిల్లిగా మారి 'హమ్మో, హయ్యో... నొప్పి... కడుపు నొప్పి... భరించలేను ! అయ్యయ్యో !...' మెలికలు తిరిగి పోతున్నాడు. నా కడుపులో కలకలం బయలుదేరింది.

రక్తం పంచుకుపుట్టిన అక్క శోకరాగాలు తీస్తుంటే భరించగలనా ? డాక్టరు దగ్గరకు బాణంలా దూసుకెళ్లి అడిగాను ఇదేమిటని. డాక్టర్ నా మిత్రుడే.

"మీ బావకు అపెండిసైటిస్ పర్ఫరేషన్. వెంటనే హైదరాబాదుకు తీసుకెళ్లి పెద్దాపరేషన్ చేయిస్తే బతకొచ్చు !" చెప్పేశాడు.

అప్పుడు రాత్రి తొమ్మిది దాటింది.

హైదరాబాద్‌లో పెద్దాపరేషనా ! దానికి బోలెడంత డబ్బు కావాలి. గంపెడంత సంసారాన్ని గుట్టుగా నెట్టుకొస్తున్న మా అక్క తలబాదుకుంది.

ఆలస్యం, అమృతం విషం అన్నారు కదా !

అర్జంట్‌గా డబ్బు సర్దుబాటు చేసుకుని టాక్సీలో బయలుదేరాం. గాంధీ హాస్పిటల్లో అడ్మిట్ చేయించేటప్పటికి అర్ధరాత్రి ఒంటిగంటయింది.

ఎమర్జెన్సీ యూనిట్‌లో "వెంటనే ఆపరేషనయి, అదృష్టం బాగుంటే బతకొచ్చు !" అన్నారు.

గ్లూకోజు ఎక్కించడం ప్రారంభమైంది. ఇహ వెంటనే ఆపరేషన్‌కు తీసుకెళ్తారని ఎదురు చూస్తున్నాం.

ఒకరిద్దరు నైట్ డ్యూటీ నర్సులు తప్ప వార్డులో డాక్టర్లెవరూ కనబడటం లేదు.

మా బావేమో నరకయాతన అనుభవిస్తున్నాడు. మా గుండెల్లో గుండ్రాళ్లు దొర్లుతున్నాయి. నర్సునడిగితే డాక్టరదిగో వస్తారు, ఇదిగో వస్తారు అంటోంది. అనడమూ, వినడమూలో రెండు గంటలు గడిచాయి.

"హమ్మో ! ఈ నొప్పి భరించలేను, నాకింత విషమిప్పించండి !" బావ దీనాలాపన. నా కడుపు తరుక్కుపోతోంది.

ప్రభుత్వాసుపత్రి. మా అక్కా పిల్లలు కంట తడిపెడ్తున్నారు. చేతులు పిసుక్కుంటున్నారు. నాలోని అసహనం ఆవేశంగా మారింది.

వెంటనే సర్జన్ గదిలోకి దూసుకెళ్లాను. అక్కడ ఇన్‌చార్జి సర్జన్, ఓ కుర్ర డాక్టర్, ఓ మామూలు డాక్టరు చాయ్ తాగుతూ పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు.

"ఎవర్నువ్వు ?" గుడ్లురిమాడు ఇన్‌ఛార్జ్ సర్జన్.

"నేనీ దేశ పౌరుణ్ణి. మా బావ అపెండిసైటిస్ పర్ఫరేషన్‌తో చావుబతుకుల్లో ఉన్నాడు. రెండు గంటల క్రితం వెంటనే ఆపరేషన్ చేయాలని మీరే అన్నారు. మీరాపరేషన్ చేసేదెప్పుడు ? పేషెంట్ చచ్చాకనా ?"

"చాల్చాల్లేవయ్యా !" ఇద్దరు డాక్టర్లు ఒంటికాలిమీద లేచారు.

"ముందు ఆపరేషన్ చేస్తారా, లేదా ?" నిగ్గదీశాను.

"మెడకాయ మీద తలకాయున్న ప్రతివాడూ మామీదకి సవారైపోయేవాడే !" ఇన్‌ఛార్జ్ సర్జన్ కుతకుతలాడాడు.

"ఇలాంటి బేవార్స్ గాళ్లను మేం కేర్ చెయ్యం !" కుర్రడాక్టరు గుర్రు.

పవిత్రమైన వృత్తిలో... పాపాత్ములా ! పీక నులిమెయ్యాలనిపించింది కానీ నా ఆవేశం ఖరీదు మా బావ ప్రాణం కారాదు. సంయమనమే శరణ్యమనిపించింది.

"మీరేం చేసినా సరే, మా బావను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లేదాకా ఇక్కణ్నుంచి కదలను !" మొండికేశాను.

డాక్టర్ల కోపం రెట్టింపైనట్టుంది.

"రాత్రింబవళ్లూ పంజేస్తూ, అలిసిపోతున్న మేమూ మనుషులమే ! మిస్టర్ నోటిట్ !" ఇన్‌ఛార్జ్ సర్జన్ ఛెయిర్ కొరిగాడు.

"మీరు మనుషులు కాదు !" అరిచాను.

"మరి... రాక్షసులమా ?" రెట్టించాడు.

"మీరు దేవుళ్ళు ! పోయే ప్రాణాలను నిలబెట్టే అవతార మూర్తులు !" చేతులెత్తి నమస్కరించాను.

"ఓహ్ ... అలాగా !" డాక్టర్ల కోపం కొండెక్కి పోయినట్టుంది. మొహాలు ఫోకస్ లైట్లలా వెలిగాయి.

పది నిమిషాల్లో మా బావ ఆపరేషన్ థియేటర్లో ఉన్నాడు. తెల్లారేసరికి ఆపరేషన్ విజయవంతమైంది.

అన్నట్టు... మా కొండయ్య బావిప్పుడు గుండ్రాయిలాగున్నాడండోయ్ !

**ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 23 నవంబర్ 1998**